సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



ముంచేసిన డ్రెయిన్లు

అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం వెరసి కైకలూరును వరద నీరు ముంచెత్తింది. పలు వార్డులు ముంపులో చిక్కుకున్నాయి. 8లో ▸



'ఈఎన్‌టీ'లో విప్లవాత్మక మార్పులు

చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. 8లో ▸



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చిన వెంకన్న దివ్య క్షేత్రంలో భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలిరాగా అన్ని విభాగాలు కిటకిటలాడాయి. 8లో ▸

న్యూస్‌రీల్

మీనవల్లూరులో ఆరోగ్య శిబిరం



ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

సాక్షి స్పందన

పెంటపాడు: 'విషజ్వరాలు.. వణుకుతున్న జనం' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ముదునూరు పీహెచ్‌సీ, పెంటపాడు మండల కార్యాలయ సిబ్బంది మీనవల్లూరులో పారిశుద్ధ్య, ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టారు. డాక్టర్లు పూజిత, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు రెడ్డి బాబు, రమేష్, రమణ మెడికల్ క్యాంపు ఏర్పాటుచేశారు. మూడు బృందాలుగా గ్రామంలో విషజ్వరాలపై సర్వే చేశారు. 24 మందికి వైద్య చికిత్సలు చేశారు. ఇందిరమ్మ కాలనీలో క్షీణించిన పారిశుద్ధ్యంపై నోటీసులు జారీ చేశారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించి దోమల మందు పిచికారీ చేయించారు.

సాగులో సాంకేతికతతో లాభాలు : కలెక్టర్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా రైతులు లాభాలు గడిస్తారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం యండగండిలో వరి సాగులో డ్రోన్‌ల వినియోగంపై రైతులతో సమీక్షా కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్‌లతో పురుగు మందు పిచికారీ చేస్తే మందును ఆదా చేయడంతో పాటు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం నమో దీదీ కార్యక్రమంలో జిల్లాకు ఆరు సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపులను ఎంపిక చేసి వాటికి రూ.60 లక్షల విలువైన 6 డ్రోన్‌లను ఉచితంగా పంపిణీ చేశారన్నారు. అలాగే ఆరుగురుకు శిక్షణ కూడా ఇచ్చారన్నారు. మరికొందరిని శిక్షణకు పంపిస్తామన్నారు. పురుగు మందులను కూలీల ద్వారా కంటే డ్రోన్‌లతో పిచికారీ చేయడం మంచిదన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్. వెంకటేశ్వర్లు, పీడీఆర్‌డీఏ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఏడీఏ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాహిత్యం వ్యక్తిత్వ వికాసానికి దోహదం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సాహిత్యం అనేది మానవ వ్యక్తిత్వ వికాసానికి సోపానం అని సీఆర్ఆర్ కళాశాల హిందీ అధ్యాపకురాలు సుమిత్రా కొత్తపల్లి అన్నారు. స్థానిక సెయింట్ థెరిసా మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన హిందీ దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. సాహిత్యంలో ప్రతి అంశం మానవ వికాసానికి ఉపయోగపడేదే అన్నారు. సాహిత్యంలోని విలువలను అందిపుచ్చుకుంటూ నవ సమాజ నిర్మాణానికి యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 'రామాయణం-విభిన్న దృక్పథాలు' అనే అంశంపై విభిన్న భాషల్లో హిందీ అధ్యాపకురాలు మహాలక్ష్మి సేకరించి రచించిన పరిశోధన వ్యాసాల గ్రంథాన్ని ఆవిష్కరించారు. రామాయణంలోని ఒక్కో చరిత్ర ఒక్కో వ్యక్తిత్వానికి ప్రతీక అని ఆమె అన్నారు.

సైబర్ నేరగాళ్ల నుంచి రూ. 2 లక్షల రికవరీ

ఏలూరు టౌన్: పోలీసులు తమ నైపుణ్యంతో సైబర్ నేరగాళ్ల భరతం పడుతూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇద్దరు బాధితుల సొమ్మును రికవరీ చేశారు. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన మహిళ సోషల్ మీడియా పోస్టులు చూసి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే తనకు అధిక వడ్డీ వస్తుందని ఆశపడింది. సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి రూ.90 వేలు పెట్టుబడి పెట్టగా వాటిని కాజేశారు. ఆమె మోసాన్ని సైబర్ క్రైమ్ 1930కు ఫిర్యాదు చేసింది. వెంటనే ఏలూరు జిల్లా సైబర్‌క్రైమ్ పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. త్రీటౌన్ స్టేషన్ పరిధిలో మరోవ్యక్తి సామాజిక మాధ్యమాల్లో సులువుగా డబ్బు సంపాదించవచ్చనే పోస్టులను చూశాడు. సైబర్ మాయగాళ్ల మాటలు నమ్మి రూ.1.10 లక్షలు పెట్టుబడి పెట్టాడు. వారు సొమ్మును కాజేయటంతో సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. రెండు కేసులకు సంబంధించి జిల్లా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్సై మధు వెంకట రాజా తన సిబ్బందితో కలిసి రూ.2 లక్షలు రికవరీ చేశారు. బాధితులు పోలీసులకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వెన్నుపోటు



నేను గతేడాది నీట్ పరీక్షల్లో రాష్ట్రంలో 990వ ర్యాంక్ సాధించాను. ప్రస్తుత ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం ద్వారా విద్యార్థులకు వెన్నుపోటు పొడిచే ప్రయత్నం చేస్తోంది. నాలాంటి విద్యార్థులకు ఉచిత సీటు లభిస్తే ఆనందంగా ఉంటుంది. ఇప్పుడు నీట్‌లో అర్హత సాధించిన నాలాంటి విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. ప్రభుత్వం కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే పేద, మధ్య తరగతి వర్గాలు వైద్య విద్యను ఎలా అభ్యసించగలవు.

– టీకేకే లక్ష్మీ దుర్గ ఇంద్రాణి, నీట్ ర్యాంకర్, మొగల్తూరు



వైద్య విద్య కలను చిదిమేసేలా..



నీట్ రాసిన విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం ఎదురుచేస్తున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పెరిగిన మెడికల్ కాలేజీలతో వీరి ఆశలు చిగురించాయని భావించారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం వీరి ఆశలపై నీళ్లు చల్లినట్టు అయ్యింది. ప్రభుత్వ ధోరణి సరికాదు. అహర్నిశలూ శ్రమించి వైద్య విద్య కలను సాకారం చేసుకునేందుకు ఎదురుచూస్తున్న తరుణంలో కాలేజీల్లో సీట్లు తగ్గించడం ఎంతవరకూ సబబు కాదు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలనుకోవడం దారుణం.

– వి.రాకేష్, విద్యార్థి, ఉంగుటూరు

కష్టాల ఖరీఫ్

నిండా ముంచేను

- 2.30 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు
- భారీ వర్షాలతో ఆదిలోనే పంట నష్టం
- 14 వేల ఎకరాల్లో రెండోసారి నాట్లు
- దాదాపు 13,300 ఎకరాల్లో పంట మునక
- నష్టాలకోర్చి సాగు చేయలేక పొలాలను ఖాళీగా వదిలేస్తున్న రైతులు
- ఆగస్టులోని వర్షాలతో 13,242 ఎకరాల్లో రూ.9.54 కోట్ల పంట నష్టం గుర్తింపు
- రైతులకు అందని ఇన్‌పుట్ సబ్సిడీ



మడి.. కన్నీటి సుడి.. వయ్యేరు డ్రెయిన్ ముంపునకు తిరుపతిపురంలో దెబ్బతిన్న వరి చేను

సాక్షి, భీమవరం: జిల్లాలోని 2.30 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగవుతోంది. మునుపెన్నడూ లేనివిధంగా నాట్లు దశలోనే భారీ వర్షాలు, వరదలు పంటకు నష్టం కలిగించాయి. ఆగస్టు చివరిలో కురిసిన భారీ వర్షాలకు వయ్యేరు, ఎర్రకాలువ, యనమదుర్రు, ఉప్పుటేరు ముంపుతో పెంటపాడు, అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు తదితర మండలాల్లోని 14 వేల ఎకరాల్లోని నాట్లు, 30 వేల ఎకరాలకు చెందిన నారుమడులు దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాల్లో రెండోసారి నాట్లు, నారుమడులు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు మరలా నారుమడులు పోయగా, మరికొందరు పొరుగు జిల్లాల నుంచి నారు కొనుగోలు చేసుకుని నాట్లు వేసుకున్నారు.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

నారుమడి నుంచి నాట్లు వేసే వరకు ఎకరాకు రూ.12 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ముంపు పొలాల్లో గుర్రపుడెక్క మేటలు వేయడంతో మరలా దమ్ము చేసి నాట్లు వేసేందుకు మరోమారు అదే మొత్తంలో ఖర్చులయ్యాయని రైతులు తెలిపారు. నష్టాలకోర్చి సాగుచేయలేక అత్తిలి, పెంటపాడు మండలాల్లో అక్కడక్కడ కొందరు రైతులు పొలాలను ఖాళీగా వదిలివేయడం కనిపించింది.

రూ.లక్షకు పైగా నష్టం.. సాగుకు దూరం

అత్తిలి మండలం ఈడూరుకు చెందిన అర్తి వీరన్న 15 ఎకరాలు కౌలు సాగు చేస్తున్నాడు. నిర్ణీత జూలై రెండో వారం నాటికే తొలకరి నాట్లు పూర్తయ్యాయి. ఈర్లకోట డ్రెయిన్‌ను ముంపునకు ఎనిమిది ఎకరాల్లోని నాట్లు దెబ్బతినడంతో రెండోసారి నాట్లు వేసుకునేందుకు నారు మడి సిద్ధం చేసుకున్నాడు.



ఇటీవల రెండోసారి డ్రెయిన్ పోటెత్తి నారుమడిని ధ్వంసం చేసింది. గుర్రపుడెక్క మేట వేసి పొలమంతా సాగు స్వరూపం కోల్పోయింది. ఇప్పటికే ఎనిమిది ఎకరాలకు రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెట్టి నష్టపోవడంతో ముందుకు సాగలేక తొలకరి సాగును వదులుకున్నాడు.



గుర్రపుడెక్క మేట వేయడంతో ఈడూరులో ఖాళీగా వదిలేసిన పొలాలు



పాలకోడేరులో రెండోసారి నాట్లు వేయిస్తున్న రైతు

రెండోసారీ ముంచిన వరదలు

గోదావరి, కొల్లేరు వరదలతో జిల్లాలోని దాదాపు 13,300 ఎకరాలు మరోమారు ముంపునకు గురైనట్టు అంచనా. వీటిలో రెండోసారి నాట్లు వేసిన పొలాలు అధికంగా ఉన్నాయి. ఆకివీడు, కాళ్ల మండలాల్లోని నాలుగు వేలకు పైగా ఎకరాల్లోని పొలాలు వారం రోజులుగా నీట మునిగి ఉండటంతో రెండోసారి వేసిన నాట్లు పనికిరాకుండా పోతాయని రైతులు ఆందోళనలో ఉన్నారు. ముంపు లాగితేగాని నష్టం తేలదంటున్నారు.

సా.. గుతున్న ఖరీఫ్ : సాధారణంగా వినాయక చవితి నాటికి ఖరీఫ్ పంట చిరుపొట్ట దశలో ఉండేది. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో కొన్నిచోట్ల రెండోసారి నాట్లు పడుతుండగా మిగిలినచోట్ల దుబ్బు దశలో ఉంది. రెండుసార్లు దమ్ము చేయడం వలన నేల గుల్లగా మారి దుబ్బు సరిగా చేయడం లేదని, కాలం మారడం వలన పెంకు పురుగు, దోమ, మాగుడు, కాండంనల్లి తదితర తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. వాటి నివారణ కోసం మందుల పిచికారీతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

కష్టకాలం.. అందని సాయం

ఆగస్టులోని వర్షాలతో జిల్లాలోని 9,918 మంది రైతులకు చెందిన 14 వేల ఎకరాల్లో రూ.9.54 కోట్లు పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. ఈ మేరకు అప్పట్లోనే ప్రభుత్వానికి నివేదిక పంపగా ఇంకా ఇన్‌పుట్ సబ్సిడీ అందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవగా ఏటా రూ.20 వేలు ఇస్తామన్న కూటమి హామీ అమలుకావడం లేదంటున్నారు.

రెండోసారి నాట్లు



వినాయక చవితి రోజులు నాటికి తొలకరి పంట సగానికి పైగా సాగు కాలం పూర్తయ్యేది. ఎప్పుడు లేనివిధంగా ఈ ఏడాది భారీ వర్షాలు తొలకరి ప్రారంభంలోనే పంటకు అపార నష్టం కలిగించాయి. మరలా నారుమడి సిద్ధం చేసుకుని ఇప్పుడు రెండోసారి నాట్లు వేస్తున్నాం. ఈ పంట ఎప్పటికి పూర్తవుతుందో, దాళ్వా ఎప్పుడు మొదలవుతుందో తెలియని పరిస్థితి. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలకు పైగా ఖర్చయ్యింది.

– కె.సుబ్బరాజు, రైతు, పాలకోడేరు

కృష్ణా జిల్లా నుంచి నారు తెచ్చుకుని..



ఐదు ఎకరాలు సాగు చేస్తున్నాను. ప్రారంభంలోనే అధిక వర్షాలకు ఎర్రకాలువ పొంగడంతో పంట మొత్తం నీట మునిగి పనికిరాకుండా పోయింది. అప్పటికే ఎకరాకు రూ.12 వేల వరకు పెట్టుబడులు పెట్టాం. తప్పనిసరి పరిస్థితుల్లో కృష్ణా జిల్లా నుంచి నారు తెచ్చి మరలా నాట్లు వేశాం. ఎకరాకు 30 పోగుల ఆకు కోసం రూ.6 వేల చొప్పున ఖర్చయ్యింది. రెండోసారి పొలం దమ్ము, నాట్లు వేసేందుకు ఖర్చు షరామామూలే.

– లంక సత్యనారాయణ, కౌలురైతు, మీనవల్లూరు, పెంటపాడు మండలం

తెగుళ్లు ఎక్కువైపోయాయి



వయ్యేరు ముంపునకు నేను సాగుచేస్తున్న ఎకరాన్నర పొలం పూర్తిగా దెబ్బతినడంతో రెండోసారి మరలా నాట్లు వేసుకున్నాం. గుర్రపు డెక్క కమ్మేయడంతో పొలాన్ని మరలా దమ్ము చేయాల్సి రావడంతో పెట్టుబడులు పెరిగిపోయాయి. పొలం బాగా లూజుగా అయిపోయి రెండోసారి నాట్లు వేసిన పొలాల్లో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. పంటకు పెంకు పురుగు, దోమ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి.

– ఆకుల వెంకటరత్నం, రైతు, వరిగేడు, అత్తిలి మండలం

ప్రభుత్వ సాయం లేదు



గతంలో ఎప్పుడు మా ప్రాంతంలో రెండోసారి నాట్లు వేసింది లేదు. ఈ తొలకరిలో ఎర్రకాలువ పొంగి మా నాలుగు ఎకరాల్లో నాట్లు పోవడంతో మరలా నారుమడులు వేసుకుని నాట్లు వేయాల్సి వచ్చింది. పంట నష్టపరిహారం కింద ప్రభుత్వం నుంచి ఇంకా ఏమీ సాయం అందలేదు. సాగు కాలం మించిపోవడం వలన రెండోసారి నాట్లు వేసిన పొలాల్లో పంట తెగుళ్ల దెబ్బకు దిగుబడులు రావడం గగనమే.

– వెలగన త్రిమూర్తులు, కౌలు రైతు, ముగ్గాపురం, తణుకు మండలం

నూనెలు సలసల

- దిగుమతి సుంకం పిడుగు
- ప్యాకెట్‌కు రూ.25 వరకు పెరుగుదల
- పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్రియం



తాడేపల్లిగూడెం: వినియోగదారుల నెత్తిన వంట నూనెల దిగుమతి సుంకం పిడుగు పడింది. నూనెల దిగుమతులపై ఇప్పటివరకు ఎలాంటి దిగుమతి సుంకాలు లేవు. దేశీయ పంటలను ప్రోత్సహించడం, రైతులకు బాసటగా నిలవాలనే క్రమంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలను పెంచుతూ ప్రకటన చేసింది. ఈ ప్రభావంతో మార్కెట్‌లో ఒక్కసారిగా నూనెల ధరల భగ్గుమన్నాయి. నూనె ప్యాకెట్‌పై రూ.20 నుంచి రూ.25 వరకు పెరుగుదల కనిపించింది. రైతులకు మద్దతుగా నిలవాలనే క్రమంలో కేంద్రం ముడి చమురుపై మిడ్‌ఫాల్ ట్యాక్సును వరుసగా తగ్గించింది. ఈ క్రమంలో జీరో ట్యాక్సుతో పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌లను దిగుమతి చేసుకొనే వాతావరణం ఉంది. క్రూడ్ పామాయిల్, క్రూడ్ సోయా, క్రూడ్ సన్‌ఫ్లవర్, ముడి సోయా, క్రూడ్ పామ్, క్రూడ్ సన్‌ఫ్లవర్ నూనెలపై ఇప్పటివరకు కస్టమ్స్ సుంకం లేదు. రిఫైన్డ్ పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్‌పై గతంలో 12.5 శాతం దిగుమతి సుంకం ఉండేది. ముడి నూనెలపై 5.5 శాతం సుంకం ఉండేది. దాదాపుగా మూడేళ్ల నుంచి సుంకాల బెడద లేదు.

విదేశాలపై ఆధారం

మలేషియా, ఇండోనేషియా, థాయిలాండ్ దేశాల నుంచి 70 శాతం పామాయిల్, అర్జెంటీనా, ఉక్రెయిన్, రష్యా నుంచి సోయా, సన్‌ఫ్లవర్ ఆయిల్ నూనెల దిగుమతులు ఉంటాయి. ఆయా దేశాలలో నూనె ఉత్పత్తుల ప్రభావం ఇక్కడి నూనెల ధరలను ప్రభావితం చేస్తుంది.

ఒక్కసారిగా పెరిగిన దిగుమతి సుంకం

దిగుమతి సుంకాలను అన్ని ఎడిబుల్, క్రూడ్ ఆయిల్స్‌పై 20 శాతం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. క్రూడాయిల్, క్రూడ్ పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ ఆయిల్స్‌పై కస్టమ్స్ డ్యూటీని 5.5 శాతం నుంచి 27.50 శాతానికి పెంచింది. రిఫైన్డ్ ఆయిల్స్‌పై సుంకాన్ని 13.75 శాతం నుంచి 35.75 శాతానికి పెంచింది. వీటికి అదనంగా అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్ కూడా ఉంటుంది. దీంతో ఒక్కసారిగా మార్కెట్‌లో నూనెల ధరలు పెరిగి సెగ పుట్టిస్తున్నాయి. శుక్రవారం వరకు 850 గ్రాముల పామాయిల్ ప్యాకెట్ ధర హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.95 ఉండగా ప్రస్తుతం రూ.114కు చేరింది. అలాగే సన్‌ఫ్లవర్ (ఫ్రీడమ్) ధర రూ.113 నుంచి రూ.130కు చేరింది. తవుడు నూనె, వేరుశనగ నూనెల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి.

జిల్లా ప్రజలపై రూ.1.4 కోట్ల భారం

జిల్లాలో ఒక్కో కుటుంబం సగటును నెలకు మూడు ప్యాకెట్ల నూనెను వినియోగిస్తాయి. ఈ లెక్కన జిల్లాలోని రెండు లక్షలకు పైగా కుటుంబాలపై సగటు భారం నెలకు రూ.60 చొప్పున మొత్తంగా రూ.1.20 కోట్ల నుంచి రూ.1.40 కోట్ల వరకు పడనుంది.

ఒక్కసారిగా పెరిగాయి

పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. రైతులను దృష్టిలో ఉంచుకొని, దేశీయంగా నూనెల ఉత్పత్తిని పెంచాలనే ఉద్దేశంతో కేంద్రం కస్టమ్స్ సుంకాలను భారీగా పెంచింది. ఈ ప్రభావంతో ప్యాకెట్‌పై రూ.19 నుంచి రూ.30 వరకు భారం పడింది.

– పవన్, వ్యాపారి

లోక్ అదాలత్‌లో 2,466 కేసుల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 2,466 కేసులను పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. వీటిలో 2,149 క్రిమినల్ కేసులు, 193 సివిల్ కేసులు, 124 వాహన ప్రమాద బీమా కేసులు, 130 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేశామన్నారు. ఏలూరులోని ప్రముఖ వాణిజ్య సంస్థల మధ్య ఉన్న చెక్ బౌన్స్ కేసులో రూ.5.50 కోట్ల రాజీ చేశామన్నారు. అలాగే 17 ఏళ్లుగా ఉన్న భూసేకరణకు సంబంధించిన రెండు కేసులను పరిష్కరించడంతో పాటు వాహన ప్రమాద బీమా కేసుల్లో రూ.50 లక్షలు పరిహారంగా బాధితులకు ఇప్పించామని తెలిపారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి స్వామి వారి 23వ వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈఓ నాగం సన్యాసిరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. తొలి రోజు పవిత్రాధివాస పూజ, 16న 54 కలశాలతో స్నపన, శ్రీ సుదర్శన నారసింహ హవనం, 17న 108 కలశాలతో అభిషేకం, శ్రీ హయగ్రీవేష్టి, 18న మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం స్వామి వారికి ప్రాకార గరుడ వాహనోత్సవం, సహస్రదీపాలంకరణ సహిత ఊంజల్ సేవ నిర్వహిస్తారని తెలిపారు.

లింగపాలెం ఎంపీడీఓ సస్పెన్షన్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల పంచాయతీలో నిధుల దుర్వినియోగంలో మరో అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇప్పటికే కార్యదర్శి సస్పెన్షన్ కాగా, తాజాగా లింగపాలెం ఎంపీడీఓ సస్పెండ్ అయ్యారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల పంచాయతీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగం జరిగినట్టు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరి 29న స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు రూ.1,43,44,700, గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసి, ప్రస్తుతం లింగపాలెంలో ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.ఆశీర్వాదం రూ.20,60,611, ప్రస్తుత గ్రామ సర్పంచ్ కె.స్వర్ణలత రూ.61,28,511 మొత్తం గా రూ.2,25,33,822 నిధులను దుర్వినియోగం చేసినట్టు తేల్చారు. దీంతో ఇటీవల కార్యదర్శి వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ వేటు పడగా తాజాగా శుక్రవారం ఎంపీడీఓ ఆశీర్వాదంను సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

జనసేన కార్యకర్తల కొట్లాట


కొట్లాటలో తీవ్రంగా గాయపడ్డ బీజేపీ కార్యకర్త బాబీ

ద్వారకాతిరుమల: క్షేత్రంలో శుక్రవారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జన ఊరేగింపులో రెండు వర్గాలకు చెందిన జనసేన కార్యకర్తలు కొట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు స్వల్పంగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో కొందరు జనసేన కార్యకర్తలు ఏటా రెండు గ్రూపులుగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఒక గ్రూపు ఆర్చి గేటు కూడలిలో, మరో గ్రూపు గ్రంథాలయ సమీపంలో ఉత్సవాలు జరుపుతున్నారు. నిమజ్జన ఊరేగింపు సమయాల్లో వీరు ఘర్షణ పడటం, కొట్లాడుకోవడం సర్వసాధారణంగా మారింది. ఈ క్రమంలోనే ఈసారి ఆర్చిగేటు కూడలిలోని వినాయక నిమజ్జన ఊరేగింపు గ్రంథాలయ ప్రాంతానికి వచ్చేసరికి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అది కాస్తా కొట్లాటకు దారి తీసింది. గొడవను సద్దుబాటు చేసేందుకు వెళ్లిన బీజేపీ కార్యకర్త బాబిని తలపై కొట్టడంతో, అతడు తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. భీమడోలు సీఐ జోసఫ్ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్‌లు సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ రెండు వర్గాలు ఆస్పత్రిలో చికిత్స పొంది, శనివారం ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని చివరకు రాజీ పడ్డారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అధిక కట్నం కోసం తనను వేధిస్తున్నారని వివాహిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన కోయ గౌతమ్ చక్రవర్తికి, మండలంలోని ఎ.పోలవరానికి చెందిన సాయిలక్ష్మికి 2018లో వివాహమైందన్నారు. వివాహ సమయంలో కట్నంగా రూ.8 లక్షలు, 20 కాసుల బంగారం ఇచ్చారన్నారు. మరో రూ.5 లక్షలు కట్నం తీసుకురమ్మని గౌతమ్ చక్రవర్తి, అతని కుటుంబసభ్యులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

కొడుకు దాడి చేశాడని ఫిర్యాదు

కైకలూరు: ఇంటికి సంబంధించిన ఆస్తిని పంచి ఇవ్వడం లేదని తండ్రిపై కొడుకు దాడిచేసిన ఘటనపై కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం పల్లెవాడకు చెందిన దుట్టా సత్యనారాయణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు శ్రీను తనకు ఇల్లు ఇవ్వాలని శుక్రవారం రాత్రి తండ్రిపై దాడి చేశారు. తండ్రి కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ముంచేసిన డ్రెయిన్లు

- కైకలూరులో ప్రజల అవస్థలు
- డ్రెయిన్ల మరమ్మతుల్లో అధికారులు విఫలం
- ఆక్రమణదారులపై చర్యలు తీసుకోని యంత్రాంగం

కైకలూరు: అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం వెరసి నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కైకలూరును వరద నీరు ముంచెత్తింది. పూర్వం ఎన్నడూ మునగని వార్డులు సైతం నడుంలోతు నీటిలో చిక్కుకున్నాయి. రోజుల తరబడి నీరు కదలకపోవడంతో ప్రజలు దుర్గంధం భరించాల్సి వస్తోంది. మరో వైపు అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయిన్లలో కిక్కిస, తూడు పెరుకుపోవడంతో నీరు పారక ఊర్లను సైతం ముంచెత్తుతుంది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు.

ఇటీవల భారీ వర్షాలకు కైకలూరులో 1, 2, 8, 16, 17, 18, 19, 20 వార్డులు ముంపులో చిక్కుకున్నాయి. ప్రధానంగా వెలంపేట కాలనీ ప్రజలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ఈ కాలనీలో రైల్వే ట్రాక్ అడుగు నుంచి 6 తూముల ద్వారా వరద నీటిని పుల్లవ డ్రెయిన్‌కు చేరడానికి పూర్వం ఏర్పాటు చేశారు. ఆక్రమణల కారణంగా కేవలం రెండు తూముల నుంచి నీరు మాత్రమే వెళ్తుంది. వెలంపేటలో డ్రెయిన్ల ఆక్రమణలు విచ్చలవిడిగా జరిగాయి. ఆక్రమణదారులకు రాజకీయనేతలు అండగా ఉండడంతో వాటి జోలికి ఎవరూ వెళ్ళడం లేదు. వర్షపునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన భరించాల్సి వస్తోంది.


కైకలూరు 8వ వార్డులో శ్యాంప్ డ్రెయిన్ ఎగదన్నడంతో మునిగిన రోడ్డు

డ్రెయిన్ల ఆక్రమణలు

కైకలూరులో రోజువారీ ప్రజల వాడకం నీరు ప్రధానంగా వార్లకోడు, పుల్లవ, శ్యాంప్ డ్రెయిన్ల ద్వారా కొల్లేరు, ఉప్పుటేరులోకి చేరుతోంది. వార్లకోడు డ్రెయిన్‌ను అనేక మంది ఆక్రమించుకుని శాశ్వత కట్టడాలు చేపట్టారు. ఇప్పటికీ ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్రమణదారులకు రాజకీయ నాయకుల అండ ఉండడంతో అధికారులు కన్నెత్తి చూడడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా శ్యాంప్ డ్రెయిన్ ఎగదన్నడంతో 8వ వార్డులో ఫైర్‌స్టేషన్ రోడ్డు మునిగింది. 1, 2 వార్డులలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కైకలూరు ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణదారులు డ్రెయిన్లను ఆక్రమించుకోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు మునుగుతున్నాయి.

ముంచుతున్న పుల్లవ డ్రెయిన్

ప్రధానంగా పుల్లవ డ్రెయిన్ రైతుల పాలిట శాపంగా మారుతోంది. దీని పొడవు 19 కిలోమీటర్లు. కైకలూరు నుంచి గోపవరం రహదారిలో పుల్లవ డ్రెయిన్ పొంగడంతో రాకపోకలు స్తంభించాయి.


కైకలూరు ఒకటో వార్డులో వరద నీరు


పుల్లవ డ్రెయిన్ పొంగడంతో కైకలూరు - గోపవరం వంతెనపై నుంచి నీరు

పుల్లవ డ్రెయిన్‌ను అనేక మంది సమీప రైతులు ఆక్రమించుకోవడంతో కుచించుకుపోతోంది. నియోజకవర్గంలో పెద కొమ్ములేరు డ్రెయిన్ వడాలి వద్ద ప్రారంభమై 26 కిలోమీటర్లు ప్రయాణించి సున్నంపూడి వద్ద ఉప్పుటేరులో కలుస్తోంది. కైకలూరు శ్యాంప్ డ్రెయిన్ పెరికేగూడెం వద్ద ప్రారంభమై 10 కిలోమీటర్ల దూరంలో ఆటపాక వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్‌లో కలుస్తోంది. లాల్వ డ్రెయిన్ కోరుకొల్లు నుంచి ఏలూరుపాడు వద్ద ఉప్పుటేరుకు చేరుతుంది. ఇక చినకొమ్ములేరు డ్రెయిన్ పెయ్యేరు వద్ద ప్రారంభమై 18 కిలోమీటర్ల దూరంలోని కాళ్ళపాలెం నుంచి ఉప్పుటేరుకు చేరుతోంది.

ముందస్తు ప్రణాళిక లోపం

వర్షాలు కురుస్తాయని ముందుగా తెలిసినా అధికారులు డ్రెయిన్లను మరమ్మతులు చేయించడంతో విఫలమవుతున్నారు. ఏటా ఇదే తంతు జరుగుతోంది. తీరా డ్రెయిన్లు పొంగినప్పుడు తూతూ మంత్రంగా పనులు చేసి మమ అనిపిస్తున్నారు. ఇదే కాకుండా డ్రెయిన్లు ఆక్రమణలకు గురవుతుంటే ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కైకలూరులో ఎన్నడూ చూడని వార్డులు సైతం డ్రెయిన్ల నీటి కారణంగా ఇప్పటికీ ముంపులోనే నానుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యమే కారణం



డ్రెయిన్ల మరమ్మతులు చేయడం లేదు. ఆక్రమణలు జరుగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు ఒకరిపై మరొకరు నెపం వేసుకుంటున్నారు. కైకలూరు వార్డులు ముంపునకు కారణం వార్లకోడు ఆక్రమణలు. రాజకీయ నాయకుల అండదండలతో బాడాబాబులు వర్లకోడును ఆక్రమించారు. హైదరాబాదులో హైడ్రా మాదిరిగా ఆక్రమణలను కూల్చివేయాలి.

– బండి శ్రీనివాసరావు, సామాజిక సేవ కార్యకర్త, కైకలూరు

చినవెంకన్న క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలో భక్తుల రద్దీ


ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: చిన వెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీ వారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

నేత్రపర్వంగా ఏకాదశి ఉత్సవం

శ్రీవారికి ఏకాదశి ఉత్సవం శనివారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, పుష్పమాలికలతో అలంకరించారు. పూజాధికాలను జరిపి హారతులిచ్చారు. ఆ తరువాత స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

అశోక్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు

కామవరపుకోట : వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కంభం విజయరాజు కళ్ళచెరువులో అశోక్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అశోక్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సేవా దృక్పథం కలిగిన నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల, మత రాజకీయాలతీతంగా తన సొంత నిధులతో చుట్టుపక్క ప్రాంతాల ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు అశోక్ ఎనలేని కృషి చేశారని వారు గుర్తు చేసుకున్నారు. జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జెట్టి గురునాథరావు, బీవీఎస్‌రెడ్డి, జగ్గవరపు జానకిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు, మండవల్లి సోంబాబు, పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అశోక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు


అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేవీపీ రామచంద్రరావు, ఎన్.రఘువీరారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, కంభం విజయరాజు

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య


రావూరి దేవి (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: భర్త కొట్టడంతో మనస్తాపం చెందిన గర్భవతి అయిన రావూరి దేవి (23) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం పాలకొల్లు మండలంలోని అరట్లకట్టకు చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, లక్ష్మీ దంపతుల కుమార్తె దేవి బీఈడి చదివేందుకు తణుకు వెళ్లింది. అక్కడ రావూరి జనార్ధన్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. దేవి ఇంట్లో ఈ విషయం తెలియగా జనార్ధన్‌కు 2021లో ఆచంట గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహమైందని.. భార్య వదిలేసి వెళ్లిపోయిందని తెలిసింది. రెండో పెళ్లి వాడు వద్దని తల్లిదండ్రులు ఎంత చెప్పినా దేవి వినిపించుకోలేదు. ఇద్దరూ తణుకులో పెళ్లి చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో దేవి తల్లిదండ్రులు కేసు పెట్టగా ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చారు. దేవికి ఏ సమస్య వచ్చినా భర్తదే బాధ్యత అంటూ జనార్ధన్‌తో కాగితాలు రాయించుకున్నట్లు దేవి బంధువులు తెలిపారు. గత ఎనిమిది నెలలుగా దేవి ఎంతో నరకం అనుభవించిందని ఆమె బంధువులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. దేవి పక్కింటి వారితో మాట్లాడినా, తల్లిదండ్రులతో మాట్లాడినా వేధించేవాడని వాపోతున్నారు. శుక్రవారం సాయంత్రం జనార్ధన్ దేవిని కొట్టి కేకలు వేసుకుంటూ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అనంతరం దేవి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అత్తగారు ఎంత పిలిచినా పలకకపోవడంతో స్థానికులు తలుపు పగులగొట్టగా ఉరివేసుకుని ఉన్నట్లు గుర్తించారు. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలియడంతో దేవి బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. దేవి మెడ మీద, దవడపై దెబ్బలు ఉన్నాయని భర్తే కొట్టి చంపేశాడని ఆవేదన వ్యక్తంచేశారు. మార్చురీలో ఉన్న దేవి మృతదేహాన్ని తహసీల్దార్ వై.దుర్గాప్రసాద్, సీఐ కె. రజనీకుమార్‌లు పరిశీలించారు. మృతురాలి తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కె. రజనీకుమార్ తెలిపారు.

త్రోబాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): జెడ్పీ ఉన్నత పాఠశాలలో త్రోబాల్ సౌత్ జోన్ స్టేట్ మీట్‌లో జరిగిన సెలక్షన్స్‌లో క్రీడాకారులను పశ్చిమ జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా సెక్రటరీ ఎస్.ఎం.శ్రీనాథ్ జట్టు వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 21, 22 తేదీల్లో విశాఖలో జరిగే పోటీల్లో పోటీపడతారని తెలిపారు. బాలురు విభాగంలో పి.సాయి గణేష్, వీపీ వెంకటేష్, జే.ప్రేమ్‌కుమార్, బి.రవితేజ, జే.రాజేష్, టి.రత్నకుమార్, అశోక్ కుమార్, పి.జయ్‌పాల్, ఎం.సుధీర్, జి.మహేష్‌తో పాటు బాలికల విభాగంలో సీహెచ్ పల్లవి, జే.ప్రియషకీల, కె.వినీల, కె.సుస్మిత, వై.మహి, సీహెచ్.శ్రావణి, కె.సుజిత, కె.రాజ్‌దీపిక, బి.భవాని, కె.ప్రణవిని ఎంపిక చేశారు.

ఈఎన్‌టీ శస్త్రచికిత్సలో విప్లవాత్మక మార్పులు

శాసన మండలి చైర్మన్ మోషేను రాజు



సమావేశంలో మాట్లాడుతున్న మోషేనురాజు

భీమవరం: వైద్య రంగంలో మార్పులకనుగుణంగా చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల్లో సైతం విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. భీమవరం రాధాకృష్ణ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెవి, ముక్కు, గొంతు వైద్యుల 42వ వార్షిక సమావేశంలో రెండో రోజు శనివారం మోషేనురాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాస్త్రీయ పద్ధతిలో నూతన వైద్య విధానాన్ని తీసుకురావడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల కోసం గతంలో నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని నేడు భీమవరంలోనే మెరుగైన ఈఎన్‌టీ వైద్యం అందిస్తున్నారన్నారు. డాక్టర్ మిలింద్ వి కీర్ తనే, డాక్టర్ కేకే రామలింగం మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు చికిత్సా విభాగం చాలా ముఖ్యమైందని న్యూరాలజీ, కేన్సర్ సర్జరీ విభాగాలకు ఇది అనుసంధానంగా ఉంటుందన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారాలు

ఈ సందర్భంగా వైద్యులను సత్కరించారు. చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ నడింపల్లి రాజన్‌రాజుకు జీవిత సాఫల్య పురస్కారం, పద్మశ్రీ డాక్టర్ జేఎమ్ వ్యాస్, పద్మశ్రీ డాక్టర్ మిలింద్ వి కీర్ తనే, డాక్టర్ కేకే రామలింగంకు లెజెండ్ ఆఫ్ ఈఎన్‌టీ అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), ఆశ్రమ వైద్య కళాశాల డైరెక్టర్ రతీదేవి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నడింపల్లి శంకర్‌కుమార్‌వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గొట్టుముక్కల బాలకృష్ణంరాజు, డాక్టర్ శేఖర్‌రెడ్డి, హరినాథ్, పీఎస్ఎన్ మూర్తి, మధుసూదనరావు, ఎన్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

వీరవాసరం: పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి అండర్ –14, అండర్–17 బాలబాలికలకు కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో మండల స్థాయి ఎంపికలు అక్టోబర్ 19, 20, 21 తేదీల్లో, నియోజకవర్గ ఎంపికలు అక్టోబర్ 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు శనివారం తెలిపారు. అండర్ –14 విభాగంలో పాల్గొనే బాలబాలికలు 01.01.2011న లేదా తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. అండర్–17 బాల బాలికల విభాగంలో పాల్గొనేవారు 01.01.2008న లేదా తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. అండర్–14, అండర్–17 జూడో జట్ల ఎంపికలు 18న ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి జరుగుతాయని తెలిపారు.

రుస్తుంబాదలో డంపింగ్ యార్డు వద్దు

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన


216 జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రుస్తుంబాద మండవారి గర్వు గ్రామస్తులు

నరసాపురం రూరల్: నరసాపురం మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును మండలంలోని రుస్తుంబాద శివారు మండవారి గర్వులో ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆర్డీవో అంబరీష్‌తో కలసి వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో రుస్తుంబాద గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ ఏర్పాటు చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని పురుగుమందు డబ్బాలతో శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గ్రామస్తులతో మాట్లాడుతూ ఇప్పటికే రుస్తుంబాదలో డంపింగ్‌యార్డు ఏర్పాటు నిర్ణయం జరిగిపోయిందన్నారు. డంపింగ్ యార్డు వల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఆర్డీవో సమాధానంతో ఆగ్రహించిన గ్రామస్తులు 216 జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణంలోని చెత్త మాకొద్దు, వ్యవసాయం ముద్దంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే తన సామాజిక వర్గానికి ఇబ్బంది కలగకూడదనే దురుద్దేశంతోనే రుస్తుంబాదలో ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ భూములు ఉన్నప్పటికి వాటిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా కమిషన్ల కోసం రెండు పంటలు పండే భూములను డంపింగ్ యార్డుకు వినియోగిస్తున్నారన్నారు. రుస్తుంబాద రైతులను మభ్యపెట్టి ఈ భూములు కొన్నారని.. సబ్ స్టేషన్ నిర్మించి విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని నమ్మబలికారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పడంతో తామంతా నమ్మామని, తీరా ఎమ్మెల్యేగా గెలిచిన మా గొంతు కోస్తారని భావించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు వల్ల ఏ ఇబ్బంది ఉండదని చెబుతున్న ఎమ్మెల్యే, అధికారులు పట్టణంలోని రాయపేటలో ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ.. రుస్తుంబాదలో డంపింగ్ యార్డు ఏర్పాటు కానివ్వమన్నారు. జాతీయ రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి, నిరసన తెలుపుతున్న రుస్తుంబాద గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. ఆందోళనలో మాజీ ఉప సర్పంచ్ కాసా సత్యనారాయణ, గాన్నబత్తుల గంగా భవానీ, లక్ష్మీకుమారి, మండ సత్యభారతి, యర్రంశెట్టి వెంకట నాగదుర్గ, మండ భాను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముత్యాలంబాపురంలో రాట పూజ



శ్రీముత్యాలమ్మ వారి దేవస్థానంలో దసరా ఉత్సవాలకు రాట పూజ చేస్తున్న ఈవో హరేరాంప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారి దసరా ఉత్సవ ఏర్పాట్లు సందర్భంగా శనివారం రాట పూజ నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల హరేరాంప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు



గణనాథుడికి పూజలు చేస్తున్న స్నేహ మిత్ర ఫ్రైండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గణపతి మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద శివాలయం సమీపంలోని స్నేహ మిత్ర సర్కిల్ సభ్యులచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మాధవరంలో అఖండ అన్నసమారాధన



మాధవరం నడివీధిలో అన్నసమారాధన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం నడివీధి సెంటర్‌లో శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉత్సవ చైర్మన్ బాలం కృష్ణ, జడ్డు హరిబాబు తెలిపారు. అన్న సమారాధనలో స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

న్యాయవాది క్రాంతిప్రసాద్‌కు సత్కారం



ఏలూరులో క్రాంతిప్రసాద్‌ను సత్కరించిన ఐజీ అశోక్‌కుమార్

తణుకు అర్బన్: తణుకుకు చెందిన సీనియర్ న్యాయవాది, నార్కొటిక్ డ్రగ్స్ సైకోట్రోఫిక్ సబ్ స్టాన్సెస్ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎన్ఎన్‌డీపీఎస్ పీపీ) గెల్లు ప్రసాద్ (క్రాంతిప్రసాద్) గౌరవ సత్కారం పొందారు. శుక్రవారం ఏలూరులో ఐజీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌డీపీఎస్ సెమినార్‌లో ఇచ్చిన ప్రసంగంతోపాటు 2020–23 వరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అందజేసిన సేవలకుగాను ఐజీ అశోక్‌కుమార్ సత్కరించినట్లు క్రాంతిప్రసాద్ తెలిపారు.

ఆకు కూరల్లో మేలైన పోషకాలు



జగన్నాథపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆకు కూరల్లో శారీరక ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు మెండుగా లభిస్తాయని ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని జగన్నాథపురం, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, మారంపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్ కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ల లోపు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు ఎ.తులసి రాణి, ఎం.శాంత కుమారి, టి.రామలక్ష్మి, కే.గీత, ఎ.అంజికుమారి, పి.ప్రమీల, వి.తులసి కోమలి, జి.అన్నపూర్ణ, కే.బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు దారేదీ?

- మూడు నెలలైనా తెరచుకోని ప్రభుత్వ సైట్..
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు..
- జగన్ ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియగా కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు..



తణుకులో మూసి వేసిన వార్డు సచివాలయం

తణుకు అర్బన్: తణుకుకు చెందిన వెంకటేశ్వరరావు అనే వృద్ధుడికి రెండునెలల క్రితమే 60 సంవత్సరాలు వయస్సు నిండింది. పింఛన్‌కు అర్హత వచ్చింది కదా దరఖాస్తు పెట్టుకుందామని సచివాలయానికి వెళ్తే ఇంకా సైట్ ఓపెన్ కాలేదు అన్నారని వాపోయారు.. ఇరగవరానికి చెందిన మహాలక్ష్మికి మూడు నెలల క్రితమే భర్త చనిపోవడంతో వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళ్తే కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడంలేదు మళ్లీ రావాలని చెప్పారంటూ కన్నీళ్లపర్యంతమైంది. అత్తిలి గ్రామానికి చెందిన పోతురాజు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే సచివాలయంలో ఇంకా దరఖాస్తులు తీసుకోవడంలేదంటున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇదీ ప్రస్తుత కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి మనోవేదన. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగేదని కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్ ఓపెన్ చేయకుండా పెట్టుకుని కూర్చుందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొత్త పింఛన్లు దరఖాస్తు చేసుకునే క్రమంతో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక పోతున్నామని ప్రజానీకం చెబుతున్నారు. అంతే కాకుండా కొత్తగా వివాహాలు అయిన వారు కొత్తగా రేషన్ కార్డు పెట్టుకునేందుకు కూడా ప్రభుత్వం ఎప్పుడు కనికరిస్తుందా అని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్..

ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఏంటని ప్రజలు సచివాలయాలకు వెళ్లి నిలదీస్తున్నారు. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోలేదంటూ ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛను తీసుకునేందుకు 60 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగత్వ నిర్ధారణతో ధ్రువీకరణ పొందిన దివ్యాంగులు పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలని ఎదురుచూపులు చూస్తుండగా, భర్త చనిపోయిన వితంతువులతో పాటు కొత్తగా రేషన్ కార్డులు పెట్టుకోవాలని కొందరు ఇలా ప్రభుత్వం సైట్ ఎప్పుడు అనుమతిస్తుందా అని చూస్తున్నారు. ప్రస్తుతం తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లతోపాటు ఒంటరి, డయాలసిస్ విభాగాలకు సంబంధించి 38,042 మందికి పింఛన్లు అందుతున్నాయి.

గతం ఘనం..

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటికెళ్లి ధ్రువపత్రాలు తీసుకుని వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్ కార్డులు ఇచ్చే సౌకర్యం అందుబాటులో ఉండేదని కానీ నేటి కూటమి ప్రభుత్వం ఇంతవరకు పాత పింఛన్లు పంపిణీ తప్ప మరేఇతర సంక్షేమం అందించే ఊసే లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. వచ్చే నెలలో ఓపెన్ చేస్తారనే ఊహాగానాలు మాత్రం వెలువడుతుండడంతో ప్రజలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

పింఛన్లు, రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియగా ఉండాలి



ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తోంది. కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు పెట్టుకునేందుకు అర్హులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ మాదిరిగా కూటమి ప్రభుత్వం కూడా కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరును నిరంతర ప్రక్రియగా చేసి ప్రజలను ఆదుకోవాలి. అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమాన్ని మంజూరు చేయాలి.

మెహర్ అన్సారీ, – వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు

కొత్త పింఛన్ల స్వీకరణకు ఆదేశాలు రావాలి



కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం ఇంకా లేదు. అయితే విజయవాడలో భారీ వర్షాలకు వరద ముంపుతో రాష్ట్ర అధికార యంత్రాంగం అంతా ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తుంది. రానున్న రోజుల్లో ప్రత్యేక కార్యాచరణతో దరఖాస్తులు స్వీకరించే విధానం అమల్లోకి వస్తుంది.

– టి.రామ్‌కుమార్, తణుకు మునిసిపల్ కమిషనర్

రాజీ మార్గంలో కేసుల పరిష్కారం



తణుకు కోర్టులో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న షేక్ సికిందర్ భాషా, జడ్జిలు

తణుకు అర్బన్: లోక్ అదాలత్‌లలో తమ కేసులు రాజీ పరచుకోవడం ద్వారా కక్షిదారులు తమ విలువైన సమయంతోపాటు ధనాన్ని కూడా సద్వినియోగపరచుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 123 కేసులు రాజీ చేశారు. ఇందులో సివిల్ 25, క్రిమినల్ 60, చెక్కు బౌన్స్ 5, ఎంసీ కేసులు 4, టెలిఫోన్ బకాయిలు 26, బ్యాంక్ బకాయిలు 3 రాజీచేశారు. సివిల్ కేసులకు సంబంధించి రూ. 56.45 లక్షలు, చెక్కు బౌన్స్ కేసులో రూ. 8.62 లక్షలు కక్షిదారులు ఇచ్చిపుచ్చుకునేలా పరిష్కరించారు. రాజీయే రాజమార్గమని లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వలన కోర్టుకు చెల్లించిన ఫీజులు కూడా తిరిగి తీసుకునే అవకాశం ఉందని న్యాయమూర్తులు చెప్పారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీ రంజిత్‌కుమార్, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ చిరంజీవి, న్యాయవాదులు ముప్పిడి సుబ్బయ్య, కౌరు వెంకటేశ్వర్లు, ఐఎస్ కృష్ణవేణి, ఎం.మృత్యుంజయరావు, టి.సత్యనారాయణరాజు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొండా శ్రీనివాసు, బ్యాంక్ మేనేజర్లు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 263 కేసుల పరిష్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో న్యాయస్థానాల ఆవరణలో శనివారం రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఆదేశాలు మేరకు జరిగిన లోక్ అదాలత్‌లో 263 కేసులు పరిష్కారం చూపారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా ఆధ్వర్యంలో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యకిరణ్ శ్రీ, 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ.అన్నామణిలు సమక్షంలో 32 సివిల్ కేసులు, 62 క్రిమినల్ కేసులు, 4 మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, 22 ప్రీ లిటిగేషన్ కేసులు, బెంచ్ కోర్టు కేసులు 143 రాజీ చేశారు. పరిహారం 2 కోట్లు 83 లక్షల 60 వేలు పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కక్షిదారులు, న్యాయవాదులు, అడ్వకేట్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులకు ఆదేశాలు జారీ చేస్తున్న జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో పాటు పలు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో పరిశీలించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ ల్యాబ్, ఐపిహెచ్ ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించారు. రోగులకు, చిన్నారులకు అందిస్తున్న వైద్యవసేవలపై సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డుల్లోని నవజాత శిశువుల తల్లులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసకున్నారు. రోగులు చెప్పిన వివరాలతో కలెక్టర్ నాగరాణి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని వైద్యులతో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని సూచనలు చేశారు. ఆస్పత్రి లోపల, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా శ్రద్ధ వహించాలని సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణకు సూచనలు చేశారు. అనంతరం మందుల స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. కాలపరిమితి ముగిసిన మందులను వేరుగా రిజిష్టరులో నమోదు చేసి మందులను విడిగా భద్రపరచాలని ఆదేశించారు. ఆర్ఎంఓ తాతారావు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం

తాడేపల్లిగూడెం నిట్ సమీపంలో విమానాశ్రయ భూముల్లోని 12 ఎకరాలలో క్రికెట్ స్టేడియం నిర్మించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నిట్ క్యాంపస్ సమీపంలోని విమానశ్రయ భూములను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

నేడు ట్రిపుల్‌ఎఫ్ ఆధ్వర్యంలో గుండె ఆపరేషన్లు

పెంటపాడు: సెప్టెంబర్ 15న ప్రత్తిపాడు ట్రిపుల్‌ఎఫ్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో 1నుంచి 14 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉచితగుండె ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ట్రిపుల్‌ఎఫ్, స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధి ఓపీ గోయంకా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఆస్పత్రి చిన్నపిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్ సుమన్ చిన్నారులకు ఆపరేషన్‌లు నిర్వహిస్తారన్నారు. గతంలో రెండు సార్లు చిన్నారులకు ఆపరేషన్‌లు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గూడెం, తణుకు పరిసర ప్రాంతాలలో ఉండే చిన్నారులకు గుండె సంబంధిత వ్యాధులు ఉంటే వారి పేర్లు తప్పక నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటికే పలువురు పేర్లు నమోదు చేయించుకొన్నారన్నారు. వివరాలకు గోరంట్ల శ్రీనివాస రెడ్డి, 99496 49519, గణేష్ 63042 40277 ఫోన్‌నెంబర్లలో పేర్లు నమోదు చేయించుకొని స్థానిక ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న సేవా భవనంలో ఉదయం 10 గంటలకు రావాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాకర్స్ అధ్యక్షుడు దూలం నాగరాజు అన్నారు. వాకర్స్ నెలవారి సర్వ సభ్య సమావేశం శనివారం పట్టణంలోని వాకర్స్ భవనంలో నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ వర్షాలు, ఎండలతో ప్రజలు అల్లలాడిపోతున్నారని, తప్పక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైద్యులను సంప్రదించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తదితర సూచనలు సభ్యులకు చేశారు. సేవా కార్యక్రమాలలో సంస్థ ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి



ర్యాలీలో మాట్లాడుతున్న డీవైఈవో మురళి సత్యనారాయణ

తణుకు అర్బన్: విద్యతోనే సమాజం అభివృద్ధి దిశగా వెళ్తుందని డీవైఈవో డి.మురళీ సత్యనారాయణ అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్ దూర విద్యావిధానంపై శనివారం తణుకు ఏకేటీపీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి అనే నినాదంతో బడిబయట ఉన్న పిల్లలకు విద్య అందించే ఉద్దేశ్యమే దూర విద్యావిధానమని అన్నారు. పది, ఇంటర్ విద్యార్థులు ఎవరైతే ఇంటివద్ద ఉండి చదువుకునే అవకాశం లేదో, ఫెయిల్ అయి చదవాలని ఉన్నా ఇంటి పరిస్థితుల దృష్ట్యా చదువుకోలేని వారి కోసం తక్కువ ఫీజుతో ఈ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఏకేటీపీ జిల్లాపరిషత్ హైస్కూల్ హెచ్ఎం టి. రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నంబరు 1 పాఠశాల హెచ్ఎం హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఇటుకుల గుంట గ్రామంలో శనివారం సీపీఎం పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ సీతారాం మృతి వామపక్ష కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆయన ఆశయాలను తీసుకెళ్లడానికి పార్టీ ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు పాలుపూరి సత్యవతి, మల్లిపూడి సీతామహాలక్ష్మి, మాగంటి వెంకటరమణ, పాలుపూరి వెంకటనాగమణి, పాశం వీరమణి, ధనలక్ష్మి ు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): తన యావత్ జీవితాన్ని ప్రజా ఉద్యమానికి అంకితం చేసిన సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలో సీతారాం ఏచూరి సంతాప సభ కార్యక్రమాలు నిర్వహించారు.

నా భర్తను ఇండియాకు రప్పించండి..



గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రసన్న, కుటుంబ సభ్యులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జీవనోపాధి కోసం బెహ్రెయిన్ దేశానికి వెళ్లి జైలులో మగ్గుతున్న నా భర్త రాజేష్‌ను ఇండియాలోని తమ స్వగ్రామానికి చేర్పించాలని తూర్పుగోదావరి జిల్లా పెదపట్నులంక గ్రామానికి చెందిన రాజేష్ భార్య ప్రసన్న శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావుకు విన్నవించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4 సంవత్సరాలుగా తన భర్త బెహ్రైన్ జైలులో మగ్గుతున్నాడని వాపోయారు. ఇద్దరు చిన్నపిల్లలతో చాలా బాధలు పడుతున్నానని తనకు తగిన సహాయం చేయాలని కోరారు. గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ తన వంతుగా ప్రయత్నం చేసి రాజేష్‌ను ఇండియాకు రప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లుకు చెందిన మానవతావాది వంగా నరసింహారావు, రజనీష్ తదితరులు ఉన్నారు.

నాగమ్మ తల్లికి భక్తుల సారె సమర్పణ

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి సమీపంలోని గౌతమి సాల్వెంట్ ప్రాంతంలో వేంచేసియున్న శ్రీచక్రసహిత నాగదుర్గాదేవి (నాగమ్మ తల్లి) ఆలయంలో శనివారం భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులు సమర్పించిన చీర, పసుపు, కుంకుమ, గాజులు, అరటిపండ్లు, మిఠాయిలను రాత్రికి అమ్మవారి ముందు ఉంచి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు భక్తులకు పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

ఐఎఫ్‌టీయూ రాజకీయ క్లాసులను జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఈ నెల 21, 22 తేదీలలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా రాజకీయ క్లాసులు జరుగుతాయని జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి ఎం.దాన వర ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని నిరంతరం పోరాటం చేయడమే కాకుండా, కార్మిక వర్గాన్ని రాజకీయంగా చైతన్యం చేసేందుకు శిక్షణ తరగతులు ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.విజయ్, మిరియాల శ్రీను, గొర్ల శ్రీను తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తణుకు టౌన్: ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. శనివారం తణుకు రామకృష్ణ సేవా సమితి భవన్‌లో వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.